క్లుప్తంగా

ఏకదంతునికి మహా నివేదన



రావూరుపాడులో వినాయకునికి 108 ప్రసాదాల మహా నివేదన

తాళ్లపూడి: గణపతి నవరాత్ర ఉత్సవాల సందర్భంగా మండలంలోని రావూరుపాడు గ్రామంలో ప్రతిష్ఠించిన గణనాథునికి భక్తులు శుక్రవారం 108 ప్రసాదాలతో మహా నివేదన చేశారు. షణ్ముఖ గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలోని రామాలయం వెనుక ఈ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. గ్రామంలోని ఒక్కో ఇంటి నుంచి ఒక్కొక్కటి చొప్పున 108 రకాల ప్రసాదాలను తయారు చేసి తీసుకుని వచ్చి బొజ్జ గణపయ్యకు సమర్పించారు. అర్చకులు నాగేశ్వరశర్మ చేతుల మీదుగా ప్రసాదాలకు పూజలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు, యూత్, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం



వ్యవహార్ రాజేంద్ర సింహ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

నిడదవోలు: హిందీభాషా దినోత్సవాన్ని స్థానిక ఎస్వీడీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. హిందీ అధ్యాపకురాలు డాక్టర్ కె. జానకిదేవి ఆధ్వర్యంలో వ్యవహార్ రాజేంద్ర సింహ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.కంబయ్య మాట్లాడుతూ హిందీని రాష్ట్ర భాషగా చేయడానికి కారకులైన వ్యవహార్ రాజేంద్ర సింహ సేవలను కొనియాడారు. హిందీ అధ్యాపకురాలు డాక్టర్ కె. జానకిదేవి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్య సాధనలో హిందీ భాష, హిందీ సాహిత్యం ఎంతో తోడ్పడ్డాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ డి.లావణ్య, డాక్టర్ పి.లలిత, పి.ఉషారాణి, సోనీ, ఇందిరా, లావణ్య, కృష్ణవేణి, సరోజినీ, మైనుద్దీన్, శ్రీదేవి, అనూష, విద్యార్థులు పాల్గొన్నారు.

ల్యాబ్ ఉద్యోగుల ధర్నాకు జిల్లా నుంచి 20 మంది

కొవ్వూరు: ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఇంటర్నల్ క్వాలిటీ మానిటరింగ్ ల్యాబొరేటరీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయం ఎదుట శుక్రవారం నిర్వహించిన ధర్నాలో జిల్లాకు చెందిన 20 మంది సిబ్బంది పాల్గొన్నారు. కొవ్వూరుకు చెందిన ఆ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శిరికొండ నాగ వెంకటగణేశ్‌కుమార్ ఈ విషయం తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 111 నీటి నాణ్యతా ప్రయోగశాలల్లో పని చేస్తున్న 510 మంది సిబ్బందీ నెలవారీ జీతాలు అందక కుటుంబ పోషణకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన వివరించారు. ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా శాఖల మంత్రి పవన్‌కల్యాణ్‌ను కలసి తమ గోడువిన్నవించుకునేందుకు తామంతా మంగళగిరి తరలి వెళ్లామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో తాము పని చేస్తున్న ల్యాబ్‌లను ఏర్పాటు చేయడంతో నెల నెలా జీతాలు అందడం లేదన్నారు. అవుట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న తమను కాంట్రాక్ట్ విధానంలోకి మార్చి, ఉద్యోగ భద్రత కల్పించాలనేది తమ ప్రధాన డిమాండ్ అని గణేశ్‌కుమార్ వివరించారు. పెండింగ్ జీతాలను వెంటనే విడుదల చేయాలని, కనీస వేతనం అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. ఎం.లక్ష్మణ్ రావు, ఎం.శివరామ్, జి.సుమన్ ఎలేసర్ తదితరులు జిల్లా నుంచి మంగళగిరి ఆందోళనకు తరలివెళ్లిన వారిలో ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

దేవరపల్లి: గుండుగొలను-కొవ్వూరు జాతీయ రహదారిపై దేవరపల్లి సమీపంలోని గ్రీన్ ఫీల్డ్ హైవే వద్ద శుక్రవారం ప్రమాదం జరిగింది. నల్లజర్ల మండలం చీపురుగూడేనికి చెందిన వసంతాడ మధుబాబు, సంగీత దంపతులు తమ ఎనిమిది నెలల కుమారుడితో బైక్‌పై రాజమహేంద్రవరం వెళుతున్నారు. బైక్ అదుపు తప్పి డివైడర్ ఐరన్ మెష్‌ను ఢీ కొట్టింది. ప్రమాదంలో మధుబాబు, సంగీతలకు తీవ్ర గాయాలు, కుమారుడికి స్వల్ప గాయాలు అయ్యాయి. భార్యాభర్తలను తొలుత రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం బొల్లినేని ఆసుపత్రికి తరలించారు. బాలుడికి దేవరపల్లిలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ప్రమాదంపై తమకు ఎలాంటి ఫిర్యాదూ అందలేదని ఎస్సై వి. సుబ్రహ్మణ్యం తెలిపారు.

అలరించిన సంగీత విభావరి

నిడదవోలు: స్థానిక గణేష్ చౌక్ సెంటర్లోని పూజా గణపతి కుమారస్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న గణపతి నవరాత్ర మహోత్సవాల సందర్భంగా శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన కాకినాడకు చెందిన అలాపన సినీ మ్యూజికల్ నైట్ శ్రోతలను అలరించింది. గాయకులు, గాయనీమణులు భక్తి గీతాలతో పాటు సినీ గీతాలను ఆలపించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వరద తగ్గుముఖం.. తేరుకుంటున్న లంకలు

- ఐదు అడుగుల మేర తగ్గిన గోదావరి
- ఇప్పటికీ దిగువ లంకలు ముంపులోనే..
- వారం తర్వాతే పంట నష్టం తేలేది



పెరవలి మండలం ముక్కామలలో వరద నుంచి తేరుకుంటున్న పంటలు



ముక్కామలలో దెబ్బతిన్న బెండ తోట

పెరవలి: గోదావరి వరద ఎంత వేగంగా పెరిగిందో అదే స్థాయిలో తగ్గుముఖం పట్టడంతో మండలంలోని వివిధ గ్రామాల్లోని లంకలు బయట పడుతున్నాయి. ఎగువ లంకలు ఒక్కటొక్కటిగా తేరుకుంటుండగా, దిగువ లంకలు మాత్రం ఇప్పటికీ వరద ముంపులోనే ఉన్నాయి. ఫలితంగా ఎగువ లంకల్లో సాగవుతున్న వివిధ రకాల పంటలు కోలుకుంటాయని దిగువ లంకల్లోని పంటలు పాడైపోతాయని రైతులు అంచనా వేస్తున్నారు. సగానికి మునిగిన కొబ్బరి, పామాయిల్, కోకో, జామ, అరటి తోటలు కొంత వరకూ దక్కవచ్చని భావిస్తున్నారు.

ముంపు బారిన 1800 ఎకరాలు

మండలంలోని పది గ్రామాల్లోని గోదావరి లంకల్లో సుమారు 3 వేల ఎకరాల్లో వివిధ రకాల ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. ఇందులో సుమారు 1,800 ఎకరాలు ముంపు బారిన పడ్డాయని అంచనా. వాటిలో పూర్తిగా మునిగిన పంటలు దెబ్బ తినే అవకాశం ఉంది. పాక్షికంగా మునిగిన పంటలు తేరుకుంటున్నాయి. ప్రధానంగా కూరగాయలు, ఆకుకూరలు, అరటి, కంద, పసుపు, మొక్కజొన్న, నువ్వులు, మినుము, బొప్పాయి పంటలు పూర్తిగా దెబ్బతింటాయని ఉద్యాన శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. మునిగిన లంక పంటలను పరిశీలించిన ఉద్యానవన అధికారులు మండలంలో 300 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని అంచనా వేసి ఇప్పటికే ఉన్నతాధికారులు నివేదిక పంపారు.

గోదావరి వరద పూర్తిగా తగ్గిన తర్వాతే లంక పంటలకు ఎంత మేర నష్టం వాటిల్లిందో ఏయే పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయో తెలుస్తుందని ఉద్యానవన అధికారులు చెప్పారు. ఇందుకు మరో వారం రోజుల సమయం పడుతుందన్నారు. ఎందుకంటే వరద తగ్గినా లంకల్లోని పల్లపు ప్రాంతాల్లో నీరు లాగాలంటే వారం పడుతుందని స్థానిక రైతులు కూడా చెబుతున్నారు. ప్రస్తుతం వరద కేవలం ఐదు అడుగుల మేర మాత్రమే తగ్గిందని ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నుంచి దిగువకు 11 లక్షల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారని జలవనరుల శాఖ అధికారులు తెలిపారు.

తేరుకున్న గోష్పాద క్షేత్రం



కొవ్వూరు గోష్పాద క్షేత్రం రోడ్డుపై పేరుకుపోయిన బురద



మద్దూరు పునరావాస శిబిరంలో బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు: గోదావరి వరద ముంపు నుంచి స్థానిక గోష్పాద క్షేత్రం తేరుకుంది. ఎగువ నుంచి వచ్చే నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టింది. ఈ క్షేత్రాన్ని వరద వీడడంతో రోడ్లపై బురద, ఒండ్రు మట్టి భారీ ఎత్తున పేరుకుపోయింది. అయితే ఇప్పటికీ ఇక్కడి షిర్డీసాయి ఆలయ ప్రాంగణంలో అడుగులోతు నీరు నిలిచిపోయింది. బురద పేరుకు పోవడంతో ఈ క్షేత్రం ఎక్కడికక్కడ అపరిశుభ్రంగా తయారైంది. ప్రస్తుతం గోదావరి నది గోష్పాద క్షేత్రం ఒడ్డును తాకుతూ ప్రవహిస్తోంది. ఇప్పటికీ స్నానఘట్టాలు పూర్తిగా వరద ముంపులోనే ఉన్నాయి. అలాగే ముంపు బారిన పడిన లంక భూములు తేరుకుంటున్నాయి. ధవళేశ్వరం ఆనకట్ట వద్ద నీటిమట్టం శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు 12.40 అడుగులకు తగ్గింది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా తగ్గుతోంది. ధవళేశ్వరం ఆనకట్ట నుంచి 10,73,678 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడిచి పెడుతున్నారు. అయితే బ్యారేజీ వద్ద ఇప్పటికీ మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. శుక్రవారం రాత్రికి ఉపసంహరించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. శనివారం సాయంత్రానికి వరద సాధారణ స్థితిని చేరుకునే అవకాశం ఉంది.

నిత్యావసరాల పంపిణీ

కొవ్వూరు మండలంలోని మద్దూరు హైస్కూల్లో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరం మూడో రోజు శుక్రవారం కూడా కొనసాగింది. ఇక్కడ ఆశ్రయం పొందిన 17 బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు చేతుల మీదుగా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి 25 కిలోల బియ్యం, తక్షణ సాయం కింద రూ.3 వేల నగదు, లీటర్ పామాయిల్, ఉల్లిపాయలు, కందిపప్పు, బంగాళాదుంపలు కిలో చొప్పున అందజేశారు. ఎంపీపీ కాకర్ల నారాయుడు, టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమణి రామకృష్ణ, మద్దూరు సర్పంచ్ ఉప్పులూరి ముని రాజేంద్ర ప్రసాద్ (బాబ్జీ), ఇన్‌చార్జ్ తహసీల్దార్ కె.అజయ్‌బాబు, ఆర్‌ఐ విశ్వేశ్వరరావు తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు. వరద ప్రభావం తగ్గడంతో పునరావాస కేంద్రంలోని బాధితులకు నిత్యావసరాలు ఇచ్చి శుక్రవారం సాయంత్రం ఇళ్లకు పంపిస్తున్నామని తహసీల్దార్ అజయ్‌బాబు తెలిపారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నిడదవోలు రూరల్: పెరవలి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న సహాయకురాలి పోస్టులకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సీడీపీఓ డి.శ్రీలక్ష్మి శుక్రవారం తెలిపారు. నిడదవోలు మండల పరిధిలో తిమ్మరాజుపాలెం (జనరల్), జీడిగుంట (ఎస్సీ), కాటకోటేశ్వరం (జనరల్), ఉనకరమిల్లి (బీసీ–డి) పెరవలి మండలం నడుపల్లి (బీసీ–డి), అన్నవరప్పాడు (జనరల్), అన్నవరప్పాడు (బీసీ–ఈ), ఉండ్రాజవరం మండలం దమ్మెను (ఎస్సీ), మోర్త (జనరల్), పసలపూడి (బీసీ–ఏ), తాడిపర్రు (జనరల్)కు కేటాయించారు. పదోతరగతి ఉత్తీర్ణులైన అర్హులైన వివాహితులు ఈనెల 20వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు పెరవలి ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని ఆమె పేర్కొన్నారు.

మరుగుదొడ్ల విధులు మాకొద్దు



తాళ్లపూడిలో ఎంపీడీవోకు వినతి పత్రం అందజేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్లు

తాళ్లపూడి: పాఠశాలల్లోని మరుగుదొడ్ల ఫొటోలు తీసి అప్‌లోడ్ చేసే విధుల నుంచి తమను తప్పించాలని మండలంలోని సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారందరూ శుక్రవారం తాళ్లపూడిలో ఎంపీడీవో వెంకటరమణకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్లు జి.గణేశ్, ఝాన్సీ, కరుణశ్రీ , వెంకటేష్, తేజ, కవిత, కుమార్, పోశమ్మ, గాయత్రి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మైనర్లకు పుట్టే పిల్లలకు వ్యాధుల ముప్పు

- డిస్ట్రిక్ట్ చైల్డ్ అండ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ క్రాంతిలాల్
- 'బేటీ బచావో– బేటీ పఢావో'పై అవగాహన సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న క్రాంతిలాల్

చాగల్లు: యుక్త వయసు రాకుండా వివాహాలు చేస్తే, వారికి పుట్టే పిల్లలకు శారీకక, మానసిక వైకల్యాలు వచ్చే అవకాశం ఉందని డిస్ట్రిక్ట్ చైల్డ్ అండ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ (నాన్ ఇనిస్టిట్యూషనల్ కేర్) జి.క్రాంతిలాల్ హెచ్చరించారు. బేటీ బచావో– బేటీ పఢావో కార్యక్రమంపై శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన తన ప్రసంగంలో బాల్య వివాహాల వల్ల సమస్యలు, తీసుకోవలసిన చర్యల గురించి వివరించారు. తహసీల్దార్ ఎం.మెరికమ్మ మాట్లాడుతూ ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే అధికారులు గుర్తించి వధూవరుల తల్లిదండ్రులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పి.నిర్మలకుమారి, విస్తరణ అధికారి ఆర్.శ్రవణ్‌కుమార్, ఎంఈఓ గురునందం, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఏచూరి మృతి వామపక్ష ఉద్యమానికి లోటు



కొవ్వూరులో సీతారామ్ ఏచూరి చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న సీపీఎం శ్రేణులు



నిడదవోలులో సీతారాం ఏచూరి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం మద్దతుదారులు

కొవ్వూరు: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి మృతి వామపక్ష ఉద్యమానికి, దేశానికి తీరని లోటని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు ఎం.సుందర బాబు పేర్కొన్నారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం ఏచూరి చిత్ర పటానికి కార్మికులు, నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం సుందరబాబు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి అంచెలంచెలుగా సీతారామ్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి స్థాయికి ఎదిగారన్నారు. ఏచూరి ఆశయ సాధనకు కృషి చేయడమే ఆయనకిచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు గంధం పూజ్య నరసింహ బాపూజీ, కరిమింజి కనకారావు, జీడీఎస్‌వీ సత్యనారాయణ, సాజిపల్లి పెంటయ్య, పలక అప్పారావు, పి.చిన్నబాబు, మాసవరపు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలులో..

నిడదవోలు: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి ఆ పార్టీ శ్రేణులు పట్టణంలో శుక్రవారం సంతాపం వ్యక్తం చేశాయి. సీతారాం ఏచూరి చిత్ర పటానికి ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు జువ్వల రాంబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. మతోన్మాదానికి, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా దేశంలోని లౌకిక శక్తులను కూడగట్టడంలో ఏచూరి జరిపిన కృషి స్ఫూర్తిదాయకమని పలువురు నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శి జి.డేనియల్, యర్రా శ్రీను, సీఐటీయూ నాయకులు గంటి కృష్ణ, రసూల్, ఉస్మాన్, రాఘవ, శ్రీరామ్, సత్యనారాయణ, షాహీ తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లిలో..

దేవరపల్లి: పీడితుల పక్షాన నిరంతరం ఉద్యమాలు నిర్వహించడమే సీతారాం ఏచూరికి ఘన నివాళి అని పలు కార్మిక సంఘాల నాయకులు అన్నారు. దేవరపల్లి కడియాలమ్మ తల్లి ఆలయం వద్ద శుక్రవారం వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కె. రత్నాజీ అధ్యక్షతన సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ఏచూరి చిత్ర పటానికి పలువురు నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. సభలో సీపీఎం జిల్లా నాయకుడు ఉండవల్లి కృష్ణారావు, ప్రగతిశీల కార్మిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌కే మస్తాన్, ఏఐఎఫ్‌టీయూ (న్యూ) నాయకులు పోలుమాటి పెంటయ్య, ఐఎఫ్‌టీయూ నాయకులు పి. నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు కాకర్ల హరిబాబు, వెలగా రామకృష్ణ, చాపల వెంకటేశ్వరరావు, సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్. భగత్ పాల్గొన్నారు.

శారీరక దారుఢ్యానికి క్రీడలు దోహదం

- ఎంపీపీ దుర్గారావు
- దేవరపల్లిలో మండల స్థాయి క్రీడా జట్ల ఎంపిక పోటీలు



దేవరపల్లిలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యురాలు స్వర్ణలత

దేవరపల్లి: శారీరక దారుఢ్యానికి, మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహద పడతాయని ఎంపీపీ కేవీకే దుర్గారావు అన్నారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఏఎస్సార్ జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో శుక్రవారం నిర్వహించిన మండల స్థాయి క్రీడా జట్ల ఎంపిక పోటీలను ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత ప్రారంభించారు. ఈ సందర్భంగా హైస్కూలు హెచ్‌ఎం కె.శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీపీ దుర్గారావు మాట్లాడుతూ మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు నియోజకవర్గం, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని విజయం సాధించాలని ఆకాంక్షించారు. జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత మాట్లాడుతూ విద్యతో పాటు ఆటలకు కూడా విద్యార్థులు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఎంఈఓ తిరుమలదాస్ మాట్లాడుతూ అండర్ 14, 17 విభాగాల్లో బాలురు, బాలికలకు పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మండలంలోని 48 పాఠశాలల నుంచి విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నట్టు చెప్పారు. పీడీ ఓరుగంటి నాగరాజు మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి 21 మధ్య నియోజకవర్గ స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు దేవరపల్లి, దుద్దుకూరు జెడ్పీ పాఠశాలల్లో జరుగుతాయన్నారు. దేవరపల్లిలో యోగా, చెస్, షటిల్, అథ్లెటిక్స్ పోటీలు, దుద్దుకూరులో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, ఎంపీటీసీ–2 కేఆర్‌ఎస్‌వీవీ అప్పారావు, శాప్ మాజీ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్, ఎంఎస్‌డీఓ టి. సరస్వతి, టీడీపీ మండల మాజీ అధ్యక్షులు సుంకర దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి మండలంలో..

తాళ్లపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి క్రీడా జట్ల ఎంపిక పోటీలు శుక్రవారం మండలంలోని గజ్జరం జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో ప్రారంభమయ్యాయి. ఎంఈవో సీహెచ్ బాలామణి, ఎంఈవో–2 సీహెచ్ నెహ్రాజీలు ఈ పోటీలను ప్రారంభించారు. అండర్ -14 , 17 విభాగాల్లో బాలురకు ఖో ఖో, కబడ్డీ, వాలీబాల్, యోగా, బాల్ బ్యాడ్మింటన్, చెస్, త్రో బాల్ తదితర క్రీడాపోటీలు నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలల నుంచి 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ ఎ.విజయకుమార్, వ్యాయామోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరంలో..

ఉండ్రాజవరం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి అండర్– 14 బాల బాలికల క్రీడాజట్ల ఎంపిక పోటీలను శుక్రవారం స్థానిక ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. మండలంలోని అన్ని పాఠశాలల నుంచి సుమారు 250 మంది క్రీడాకారులు ఈ పోటీలకు హాజరయ్యారు. హెచ్‌ఎం కేఎస్ మాణిక్యాలరావు, పోటీల మండల కో–ఆర్డినేటర్ బి.సుబ్రహ్మణ్యస్వామి, ఎంఎస్ వల్లి, వి.సత్యనారాయణ, ఎ.నాగేశ్వరరావుతో పాటు వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.

కళలను ప్రోత్సహించడం అభినందనీయం

- సినీ, బుల్లితెర నటుడు రవికృష్ణ
- చాగల్లు తెలగా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం



చాగల్లు తెలగా సంఘం కళావేదికపై సినీ, బుల్లితెర నటుడు రవికృష్ణను సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు



తెలగా సంఘం కళావేదికపై విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

చాగల్లు: గణపతి నవరాత్ర మహోత్సవాలను చాగల్లులో దశాబ్దాలుగా వైభవంగా నిర్వహించడమే గాకుండా కళలను, కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమని సినీ, బుల్లితెర నటుడు, మొగలిరేకులు సీరియల్, నిరూపాక్ష ఫేం రవికృష్ణ అన్నారు. స్థానిక తెలగాసంఘం కళావేదికపై గురువారం రాత్రి రాజకీయ, సినీ, నాటక రంగ ప్రముఖులను సత్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన నటుడు రవికృష్ణ మాట్లాడుతూ ఏటా దిగ్విజయంగా ఉత్సవాలు నిర్వహిస్తూ, వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న వారిని సత్కరిస్తున్న సినీ దర్శకుడు వీవీ వినాయక్ సోదరులను, తెలగాసంఘాన్ని అభినందించారు. అనంతరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నటుడు రవికృష్ణను దుశ్శాలువా, పూలమాలతో సత్కరించి, జ్ఞాపిక అందజేశారు.

మెరిట్ విద్యార్థులకు బంగారు పతకాలు

తెలగా సంఘం వేదికపై మెరిట్ విద్యార్థులను సినీ నటుడు రవికృష్ణ, ప్రముఖ రంగస్థల నటుడు గుమ్మడి గోపాలకృష్ణ చేతుల మీదుగా సత్కరించారు. ఇంటర్మీడియెట్‌లో అత్యధిక మార్కులు సాధించిన చాగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని ఎండీ ఆయోషా సిద్ధికాకు దుశ్శాలువా కప్పి బంగారు పతకాన్ని బహూకరించారు. ఈ పతకాన్ని జగతా సుబ్బారావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు శ్రీనివాసరావు, దాసరి నారాయణరావు ఏర్పాటు చేశారు. అలాగే టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించిన స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని బొల్లా స్నేహకు కూడా బంగారు పతకాన్ని బహూకరించారు. ఈ పతకాన్ని జుట్టా సీతారామయ్య జ్ఞాపకార్థం ఆయన అల్లుడు వర్ధినీడి భీమేశ్వరరావు, కుమారులు, చిరంజీవి ప్రోత్సాహక బహుమతి పేరిట ఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ మట్టా వీరాస్వామి, ఎంపీటీసీ సభ్యురాలు ఇంటి కృష్ణవేణి, ఉత్సవ కమిటీ నిర్వాహకుడు, మాజీ సర్పంచ్ గంగ్రోతు సురేంద్రకుమార్, టీడీపీ నాయకులు కరుటూరి సతీష్, కోడూరి ప్రసాద్, జుట్టా కొండలరావు, పిండి మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలు

గణపతి నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి చాగల్లు తెలగా సంఘం వేదికపై 'శ్రీకృష్ణరాయబారం' పౌరాణిక నాటకంలోని ప్రధాన ఘట్టాలను ప్రదర్శించారు. అలాగే వర్తక సంఘం కళావేదికపై మహానాటక త్రయంలో భాగంగా గయోపాఖ్యానం, బాలనాగమ్మ, సత్యహరిశ్చంద్ర నాటకాల్లోని ప్రధాన ఘట్టాలను ప్రదర్శించారు.

కొత్త మినుము వంగడంపై రైతులకు అవగాహన



కొత్త వంగడం సస్యరక్షణ, విత్తనశుద్ధి గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ కరుణశ్రీ

నల్లజర్ల: ఈ ఏడాది వీబీఎన్–8 అనే కొత్త రకం మినుము వంగడాన్ని మండలంలోని ప్రకాశరావుపాలెం, సింగరాజుపాలెం, తెలికిచెర్ల గ్రామాల రైతులకు పరిచయం చేస్తున్నట్టు వెంకట్రామన్నగూడెం కృషీ విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కరుణశ్రీ చెప్పారు. కొత్త రకం మినుము విత్తన శుద్ధి, సస్యరక్షణ చర్యల గురించి గురువారం ఆయన ప్రకాశరావుపాలెంలో రైతులకు వివరించారు. ఎకరానికి 8 కిలోల చొప్పున రైతులకు ఈ విత్తనాన్ని అందించారు. సమగ్ర సస్యరక్షణలో భాగంగా విత్తన శుద్ధిపై ప్రదర్శన ఏర్పాటు చేశారు. విత్తనం నాటిన తర్వాత 24 రోజుల వరకూ పురుగుల తాకిడిని తట్టుకునేలా ఇమిడాక్లోప్రిడ్ మందును 5 గ్రాములు కిలో విత్తనానికి చొప్పున మొత్తం కలిసేలా కలియబెట్టాలన్నారు. ఒక గంట తర్వాత ఆ విత్తనాన్ని విత్తుకోవాలన్నారు. రక్షణ విభాగం శాస్త్రవేత్త డాక్టరు చిరంజీవి కూడా రైతులకు సూచనలు ఇచ్చారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

నల్లజర్ల: మండలంలోని పుల్లలపాడు సబ్ స్టేషన్ పరిధిలో అన్ని ఫీడర్లకూ కొత్త బ్రేకర్లు అమర్చే నిమిత్తం శనివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ బి.వీరభద్రరావు శుక్రవారం తెలిపారు. ఈ కారణంగా పుల్లలపాడు, ముసుళ్లగుంట గ్రామాల్లో గృహ,వాణిజ్య, ఇండస్ట్రియల్ అవసరాలకు విద్యుత్తు సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వరద బాధితులకు రూ.లక్ష విరాళం

గోపాలపురం: ఇటీవల విజయవాడలో కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న బాధిత కుటుంబాలకు విరాళంగా మండలంలోని గుడ్డిగూడెం గ్రామానికి చెందిన శ్రీనివాసా ఇండస్ట్రీస్ అధినేత సాగిరాజు అభిమన్యురాజు రూ.లక్ష చెక్కును శుక్రవారం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజుకు అందజేశారు.

ధారవరం వృద్ధుడి విరాళం

నిడదవోలు: విజయవాడ వరద బాధితులకు కర్ణాటకలో స్థిరపడిన చాగల్లు మండలం ధారవరం గ్రామానికి చెందిన వృద్ధుడు మద్దుకూరి నరసింహమూర్తి విరాళం ఇచ్చారు. సీఎం రిలీఫ్ ఫండ్‌కు పంపిచాలని కోరుతూ రూ.36 వేల చెక్కును పట్టణ టీడీపీ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావుకు స్థానిక టీడీపీ పట్టణ కార్యాలయంలో శుక్రవారం ఆ వృద్ధుడు అందజేశారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ కార్యదర్శి తిరుపతి సత్యనారాయణ, కౌన్సిలర్ కారింకి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం బియ్యం సేకరణ

దేవరపల్లి: విజయవాడ వరద బాధితులను ఆదుకోవడానికి తమ వంతు సాయంగా నల్లజర్ల మండలంలోని జనసేన పార్టీ శ్రేణులు గ్రామాల్లో బియ్యం సేకరించారు. ఇంటింటికీ తిరిగి 60 క్వింటాళ్ల బియ్యం సేకరించి దేవరపల్లిలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కన్వీనర్ డి.సువర్ణరాజుకు అందజేశారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పార్టీ శ్రేణులు బియ్యం సేకరిస్తున్నాయని, ఆ బియ్యాన్ని త్వరలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సమక్షంలో వరద బాధితులకు అందజేస్తామని సువర్ణరాజు తెలిపారు.